రేషన్ డీలర్ల పరీక్ష ప్రశాంతం

పరీక్ష కేంద్రాన్నిపరిశీలిస్తున్న ఆర్‌డిఒ అఖిల

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో కృతివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాల్లో జరిగిన రేషన్ షాపు డీలర్ల నియామక పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాన్ని ఆర్‌డిఒ దేవరకొండ అఖిల పరిశీలించారు. డీలర్ల ఎంపిక పరీక్షకు 135 మంది హాజరవ్వాల్సి ఉండగా 8 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 127 మంది పరీక్షకు హాజరైనట్లు తహశీల్దార్ ఎం.సావిత్రి వివరించారు.

రాఘవమ్మ ఆశయాలను కొనసాగిస్తాం...

సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి - అమలాపురం

కుడుపూడి రాఘవమ్మ ఆశయాలను కొనసాగిస్తామని పలువురు వక్తలు అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామంలో కుడిపూడి రాఘవమ్మ సంతాప సభ సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, డి.రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరాం, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు హాజరయ్యారు. తొలుత రాఘవమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడారు. పేదలు, మహిళలు, కార్మికుల కోసం రాఘవమ్మ చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. అప్పుడున్న పరిస్థితిల్లో రాఘవమ్మ ఎర్రజెండాను పట్టుకని ప్రజా సమస్యలపై గొంతు విప్పడం సాధారణ విషయం కాదన్నారు. ఆమెను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మరో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ కుడుపూడి రాఘవమ్మ భర్త ఉపాధ్యాయ వృత్తిలో పనిచేశారన్నారు. సమ సమాజ నిర్మాణం కోసం తన భార్యను కమ్యూనిస్టు పార్టీ నాయకురాలుగా తయారు చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. కమ్యూనిస్టుగా ఎర్ర జెండా పట్టుకుని ఏళ్ల తరబడి ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. రాఘవమ్మ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భర్త మరణానంతరమూ ఆమె ఉద్యమాన్ని వీడలేదన్నారు. తాను నమ్మిన సిద్ధాంతానికి తుది శ్వాస వరకూ కట్టుబడి ఉన్నారన్నారు. ఆమె ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం, ప్రజా సంఘాల్లో రాఘవమ్మ చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. వ్యవసాయ కార్మికుల కోసం చేసిన పోరాటాలు ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటాయన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బలరాం మాట్లాడుతూ ఎవరు ఏమైతే మనకెందుకులే అనే ఈ కాలంలో ఒక మహిళ ప్రజా సంఘాలు, ఉద్యమాల్లో పోరాటం చేయడం, జెండా పట్టుకుని రోడ్లపై తిరగడం సాధారణ విషయం కాదన్నారు. ఆమె ఆశయ సాధన కోసం మనమంతా కషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నాయన్నారు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించి పబ్బం గడుపుకుంటున్నాయన్నారు. దీన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. దేశ సమగ్రత, సమైక్యత కోసం పాటుపడాలని పిలుపునిచాచరు. కుడుపూడి రాఘవమ్మ ఆశించినట్టు ప్రస్తుతం దేశాన్ని పట్టిపీడిస్తున్న ఈ మతోన్మాద శక్తులను తిప్పి కొట్టడమే ఆమెకి ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు డాక్టర్ చల్లా రవికుమార్, డివి.రాఘవులు, టి.నాగవరలక్ష్మి కాకినాడ జిల్లా నాయకులు కమిడి సత్య శ్రీనివాస్, మోర్త రాజ్‌శేఖర్, సిహెచ్.రమణి, నాయకులు పి.రామకృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, కెవిపిఎస్ కాకినాడ జిల్లా నాయకులు సింహాచలం, పాలిక శ్రీను అంగన్‌వాడీ సంఘం నాయకులు అమూల్య, గంగారత్నం, దైవకృప, నాయకులు బుంగ సత్యనారాయణ, పీతల రామచంద్రరావు, వెంకట్రావు, తాడి శ్రీరామ్మూర్తి, సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.


సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

రాఘువమ్మకు నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం, ఎంఎల్‌సి ఐవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

అమిత్ షా గో బ్యాక్

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - అమలాపురం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై వామపక్షాలు నిరసన తెలిపాయి. ఎపిలో అమిత్ షా రాష్ట్ర పర్యటన సందర్భంగా అమిత్ షా గో బ్యాక్ ఈ రాష్ట్రం నుంచి వెళ్లిపోమని డిమాండ్ చేస్తూ సిపిఎం వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద నిరసన తెలియజేశాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ సందర్భంగా డి.రమాదేవి మాట్లాడుతూ ఈ దేశంలో బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార మార్గాన్ని చూపుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఆ రాజ్యాంగాన్ని నేడు పరిపాలన చేస్తున్నటువంటి బిజెపి మతోన్మాద శక్తులు తుంగలో తొక్కి రాజ్యాంగాన్ని నాశనం చేయాలని అంబేద్కర్‌కు ఉన్నటువంటి పేరుని క్రెడిబుల్టీని ధ్వంసం చేయాలనేటువంటి ఉద్దేశంతోనే అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. తక్షణ అమిత్ షా ను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు ఈ దేశం సంపదను కార్పొరేట్ కంపెనీలు కట్టబెడుతున్నారని, ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం తీవ్రతరం చేస్తున్నారని, రైతులు తమ గిట్టుబాటు ధరకు కల్పించాలని ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. ప్రజలంతా ఈ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఈ సందర్భంగా ఆమె పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరావు, జిల్లా కమిటి సభ్యురాలు టి.నాగవరలక్ష్మి, నాయకులు పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ తాడి శ్రీరామ్మూర్తి, సిహెచ్. సూర్యప్రకాశరావు, పి.శ్రీనివాస్, టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యార్లగడ్డ కుటుంబానికి మంత్రి సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

వెల్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన యార్లగడ్డ శ్రీను కుటుంబాన్ని మంత్రి వాసంశెట్టి శుభాష్ ఆదివారం పరామర్శించారు. మృతుని కుటుంబానికి రూ. 25 వేల సాయం అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులను మంత్రి సుభాష్ ఓదార్చారు. ఇటీవల మరణించిన కోనప రెడ్డి వరలక్ష్మి, తుమ్మరపల్లి మంగలక్ష్మి కుటుంబాలను మంత్రి సుభాష్, కూటమి నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, తదితరులతో కలిసి పరామర్శించారు.

రూ.25వేలు అందజేస్తున్న మంత్రి సుభాష్

కైలాసభూమి పనుల పరిశీలన

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక కైలాసభూమిలో జరుగుతున్న చివరి దశ పనులను స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ కైలాస భూమి పనులు దాదాపుగా పూర్తయ్యాయని అన్నారు. కొద్ది రోజుల వ్యవధిలోనే కొత్తపేట కైలాస భూమిని అతి త్వరలోనే అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. చనిపోయిన వారి అంత్యక్రియలు చేయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని గ్రహించి నూతన ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుండి ఈ కైలాస భూమి పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. దాతలు, ప్రభుత్వ నిధులతో పూర్తి స్థాయిలో ఈ కైలాస భూమిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంబూరి రెడ్డియ్య, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి భాస్కరరావు, ముద్రగడ సుబ్బారావు, పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యా ప్తంగా ఈ నెల 20వ తేదీ సోమవారం నిర్వహించ నున్న పశు వైద్య శిబిరాలను సద్విని యోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పాడి రైతులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్లో పశు వైద్య శిబిరాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 20వ తేదీనుంచి 31వ తేదీ వరకు గ్రామా ల్లో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం - సౌజ న్యంతో రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తారన్నారు. పశు సంపదను వద్ది చేసుకునేందుకు, పశువుల ఆరోగ్య పరిరక్షణ, ఆరోగ్యాన్ని కాపాడు కునేందుకు ఉచితంగా గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా నిర్వహించే శిభి రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పశు ఆరోగ్య శిబిరాలు ద్వారా పశు విద్య చికిత్సలు, నట్టల నివారణా మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన వంటి సేవలు అందిస్తారన్నారు. పాడి రైతులు అందరూ ఈ ఉచిత పశు ఆరోగ్య శిబి రాలను సద్విని యోగం చేసుకుని పశు సంపద అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ పశు వైద్యులు, పారా పశు వైద్యులు, సిబ్బందితో కూడిన బృందాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. పశుపో షకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య బృందాలు గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తూ గొర్రెలు, మేకలు, లేగ దూడలకు నట్టల నివారణ మందు ఉచితంగా అందిస్తారన్నారు. పశువులకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు, గర్భకోశవ్యాధు లకు సంబంధించి అవసరమైతే శస్త్ర చికిత్సలకు చర్యలు తీసుకుంటారని వివ రించారు. పోషకులు, రైతులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఆర్థిక సాయం తదితరాలపై వివరించారు. ప్రభుత్వం పశుపోషణకు అధిక ప్రా ధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ, ఉత్పత్తి పెంచడం, వ్యాధుల నివారణ, పశు పోషణ ఖర్చు తగ్గించ డానికి అనేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. జిల్లాలో పశు ఆసుపత్రులు, డిస్పెన్సరీలు, గ్రామీణ పశు వైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు ద్వారా పశువుల ఆరోగ్యాన్ని పరిర క్షిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య శాఖ సిబ్బంది వినోద్ కుమార్ తదిత రులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

శ్యామ్‌కుమార్‌కు సేవా పురస్కారం అందజేత

ప్రజాశక్తి - ఆత్రేయపురం

విద్యావ్యవస్థకు చేసిన కృషికి మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, మనస్తత్వవేత్త, ఉపాధ్యాయుడు చింతా శ్యామ్‌కుమార్‌కు సేవా పురస్కారం అందుకున్నారు. ఇటీవల అమలాపురం సత్యసాయి కళ్యాణ మండపంలో కోనసీమ చిత్రకళా పరిషత్ 35వ వార్షికోత్సవం సందర్భంగా కళా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) చేతుల మీదుగా శ్యామ్ విద్యావ్యవస్థకు చేస్తున్న కృషికి గాను కోనసీమ చిత్రకళా పరిషత్ రజతోత్సవ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం శ్యామ్ ఇచ్చిన బ్లైండ్ ఫోల్డ్ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాపరిషత్ వ్యవస్థాపకుడు కొరసాల సీతారామస్వామి, రవితేజ, లండన్ ఫిజియోథెరపిస్ట్ మోహిత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

శ్యామ్‌ను మెమెంటతో సత్కరిస్తున్న ఎంఎల్‌సి ఐవి

ముమ్మురంగా వరినాట్లు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలో రబి సీజన్‌లో భాగంగా పంట పొలాల్లో వరినాట్లు ముమ్మురంగా సాగుతున్నాయి. మండలం, నగర పంచాయతీ పరిధిలో సుమారు 8వేల హెక్టర్లలో వరినాట్లు వేస్తున్నారు. సంక్రాంతి నాటికే వరినాట్లు పూర్తి కావలసిన ఉంది. అయితే ఖరీఫ్ పంట కాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా సంక్రాంతి పండుగ తరువాత రబీ సీజన్లో వరినాట్లు ముమ్మురంగా సాగుతున్నాయి. దీంతో రైతులు కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వరినాట్లు వేస్తున్న కూలీలు

కార్టూ'నిజం'



మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ వేగుళ్ల పరామర్శ

ప్రజాశక్తి - మండపేట

పట్టణం, మండపేట మండలంలో ఇటీవల వివిధ కారణాలతో పలువురు మరణించారు. మృతుల కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. పట్టణం లోని బంగారు వాసు, రేలంగి రామారావు కుటుంబ సభ్యులను, ఏడిద గ్రామంలో ఈదర సూర్య ప్రకాష్, లంకలపల్లి బుల్లబ్బు, ఇప్పనపాడు గ్రామంలో మాశిన వీర్రాఘవమ్మ, వెలగతోడు గ్రామంలో రెడ్డి మంగాయమ్మ, ద్వారపూడి గ్రామంలో మర్రెడ్డి వెంకటేశ్వరమ్మ గార్ల కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మండలటిడిపి అధ్యక్షులు యరగతపు బాబ్జి, జొన్నపల్లి సూర్యారావు, పర్వతిన వీర్రాజు, మేకా జేజిబాబు, చోడె పెదకాపు, , వల్లూరి వీరవెంకట సత్యనారాయణ, బొల్లి తారకరామారావు, వలిరెడ్డి దుర్గారావు, సత్తి సత్యనారాయణ, తదితర్లు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

ఉత్తమ రైతు వీరభద్రరావు మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, టిడిపి రాష్ట్ర తెలుగు రైతు మాజీ కార్యదర్శి,, నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మామిడికుదురుకు చెందిన నయనాల నాగమణి వీరభద్రరావు(79) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆర్థర్ కాటన్ రైతు సంఘం అధ్యక్షుని ‌గా సేవలందించారు. ఆయన మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. భద్రరావు మృతికి కూటమి నాయకుల సంతాపం తెలిపారు.

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం ఈనెల 20 సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగాకలెక్టరేట్లోని గోదావరి భవన్‌లో నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలన్నారు. జిల్లా స్థాయితో పాటు డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. డివిజన్ స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాలలో నిర్వహిస్తారని డివిజనల్ స్థాయి అధికారులు అందరూ సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయాలలో పాల్గొంటారన్నారు. మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సంబంధిత మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహిస్తారన్నారు.కార్యక్రమంలో తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారుల తో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

గుడ్ సీడ్ ఫౌండర్ రమణారావుకు సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కూనవరంలోని జీవముగల దేవుని సంఘంలో ఆదివారం అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచె రమణారావును ఘనంగా సత్కరించారు. స్థానిక పాస్టర్ పండు డేవిడ్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం నిర్వహించారు. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా సంఘం తరపున పేదలకు సేవలందిస్తున్న రమణారావుకు సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి, పాస్టర్ డేవిడ్ రాజు, సంఘ పెద్ద వాకపల్లి సత్యనారాయణ, సంఘస్తులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

రమణారావును సత్కరిస్తున్న సర్పంచ్ ఈశ్వరి పాస్టర్ డేవిడ్ రాజు సంఘస్తులు

ఘనంగా వరుణ్‌తేజ్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - అమలాపురం

కోనసీమ వరుణ్ తేజ్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు పిండి రాజా ఆధ్వర్యంలో సినీ నటుడు వరుణ్ తేజ్ పుట్టినరోజు వేడుక వెంకటరమణ థియేటర్ ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమాన సంఘం నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను పిండి రాజా కట్ చేశారు. అదేవిధంగా వెంకటరమణ థియేటర్లో పనిచేస్తున్న సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లా చిట్టిబాబు, ఏడిద శ్రీను, నల్లా నాయుడు, సత్తిబాబు రాజు, వెంకటరమణ థియేటర్ యజమాని సుబ్బరాజు, లింగోలు కృష్ణ, నల్లా సాగర్, పోలిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న సినీ నటుడు వరుణ్‌తేజ్ అభిమానులు

21న ఆలమూరు మండల సమావేశం

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తామని ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఎ.రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మం డల, గ్రామ స్థాయి అధికారులతో పాటుగా ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే మండల పరిధి వివిధ శాఖల అధికారులు ఇంత వరకు పూర్తిచేసిన, పూర్తిచేయాల్సి పనుల వివరాలతో తప్పకుండా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్ పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్య సంరక్షణ కోసం పోషణ్ ప్లస్

ప్రజాశక్తితో తూర్పు గోదావరి జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి వసుంధర

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

బాలికల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా పోషణ్‌ప్లస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తూర్పు గోదావరి జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎన్.వసుంధర తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇతర శాఖల సమన్వయంతో ఈ నెల 9వ తేదీ నుంచి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర ప్రజాశక్తితో మాట్లాడారు. జిల్లాలో అమలు చేస్తున్న పోషణ్ ప్లస్ కార్యక్రమం గురించి పలు విషయాలను పంచుకున్నారు.

బాలికల్లో రక్త హీనత సమస్యలను అధిగమించేందుకు..

కౌమార దశలోని ఆడపిల్లల్లో రక్తహీనత తలెత్తకుండా నివారించేందుకు పోషణ్ ప్లస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా వసతి గృహాల్లో ఉన్న బాలికలకు ఐరన్ మాత్రలతో పాటుగా, మునగాకు పొడిని అందిస్తున్నాం. ఎనీమియా లోపం వల్ల రక్త హీనత కలిగి కళ్ళు తిరిగి పడిపోవడం వంటివి జరుగుతూ ఉంటాయి. మనం తీసుకునే ఆహారంలో తప్పకుండా ఐరన్ పోషకాలు అందుతున్నయో లేదో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

వసతిగృహాల్లో అవగాహనా కార్యక్రమాలు

సంక్షేమ వసతిగృహాల్లో బాలికలకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ వసతిగృహాల్లో 2,793 మంది వరకూ కిశోర బాలికలకు మురింగా (మునగాకు) పొడిని ఇప్పటికే అందజేశాం. పిల్లలు చిన్నతనం నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చేసుకొవాలి. ఆ మేరకు వారిలో అవగాహన కల్పించాలని లక్ష్యం తీసుకున్నాం. మునగాకు పౌడర్‌ను రోజు విడిచి రోజు తప్పకుండా ఆహారంలో తీసుకోవడం వల్ల రక్త హీనతను అధిగమించే వీలుంటుంది.

ఆహార అలవాట్లలో మార్పు

గతంలో చిరు ధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు ఆహారంలో భాగంగా ఉండేవి. కాని ప్రస్తుతం పరిస్థితి మారింది. ఫాస్ట్ ఫుడ్స్, పోషక విలువలు లేని ఆహారం తీసుకోవడం వల్ల రక్త హీనతకు గురవుతున్నారు. దీన్ని అధిగ మించాలంటే చిరుధాన్యాలు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. వసతిగృహాల్లో బాలికలకు ప్రభుత్వం అందచేస్తున్న ఆహారానికి అదనంగా 'ప్రాజెక్ట్ ఐరెన్ ప్లస్' కార్యక్రమాన్ని చేపట్టాం. మునగాకు పొడితో పాటు అదనంగా కరివేపాకు, క్యారెట్ తదితర పోషక విలువలు కలిగిన వాటిని శరీరతత్వం, వయస్సు ఆధారంగా ఆహారంలో తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పోషణ్ ప్లస్ కార్యక్రమం ద్వారా బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఆరోగ్య పరిరక్షణపై, మంచి పోషక విలువలు కలిగిన ఆహారంలో తీసుకోవాలని సూచిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా యుక్త వయసులో వున్న బాలికలు భవిష్యత్తులో కూడా కొనసాగించేలా దిశ నిర్ధేశం చేస్తున్నాము. ఈ కార్యక్రమానికి ముందుగానే సిబ్బందికి అవగాహన కల్పించాం. ఈ మేరకు సత్ఫలితాలు ఇస్తున్నాయి.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన మినీ వ్యాన్

ఫ్లయ్‌ఓవర్‌పై లారీ, మినీ వ్యాన్ ఢీ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం కామనగరువు మీదుగా సాగిన బైపాస్ రోడ్డు ఫ్లయ్‌ఓవర్‌పై ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న లారీ, మినీ వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ రెండు కాళ్లు విరిగిపోయాయి. వివరాల్లోకి వెళితే యూరియా బస్తాలతో కాకినాడ నుంచి పేరూరు వై జంక్షన్ వైపు లారీ వెళుతోంది. ఇదే సమయంలో సామగ్రితో హైదరాబాద్ నుంచి వై జంక్షన్ మీదుగా కాకినాడ వైపు వెళుతున్న మినీ లారీ వెళుతోంది. అయితే ఫ్లయ్‌ఓవర్ పై ఢీకొన్నాయి. దాంతో వ్యాన్ పూర్తిగా నుజ్జునుజ్జయింది. అంతే కాకుండా ఆ వ్యాన్ డ్రైవర్ కాళు కూడా విరిగిపోయాయి. తాలుకా ఎస్సై శేఖర్ బాబు,సర్పంచ్ నక్కా అరుణ కుమారి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు లు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో క్షతగాత్రులను బయటకు తీశారు. జేసీబీ సాయంతో ఆ వాహనాలను పెకిలించారు. తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలిక అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - మామిడికుదురు

పెదపట్నంలంక కి చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం నగరం పోలీసులు తెలిపారు. స్థానిక హైస్కూల్లో పదవ తరగతి చదువుచున్న చొప్పల్ల కళ్యాణి (15)ఈ నెల 19 తెల్లవారుజాము నుంచి కనిపించుటలేదని ఆమె తల్లి చొప్పల్ల నాగమణి ఫిర్యాదు చేసింది. బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరం పోలీసులు తెలిపారు

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - అమలాపురం

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలయ్యాయి. అల్లవరం మండలం గోడి కొత్తకాలనీలో కేతా లాస్య మాధురి శనివారం డాబా మీద ఆడుకుంటుండగా విద్యుత్ షాక్ గురై తీవ్ర గాయాలు పాలయ్యింది. చిన్నారిని రక్షించబోయిన ఆమె తల్లి కేతా రమాదేవికి కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. ఇద్దరికీ కాకినాడ జిజిహెచ్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. శస్త్రచికిత్స చేసి అనంతరం వైద్యులు లాస్య మాధురి చేతిని తొలగించారు. సంక్రాంతి సెలవులకు కాకినాడ నుంచి గోడి కొత్త కాలనీకి వచ్చి లాస్య మాధురి కుటుంబం బంధువుల ఇంటికి వచ్చింది. అయితే తమ ఇంటిపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమ గోడు వినలేదని చిన్నారి బంధువులు తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ముగ్గళ్లలో నూతన సంవత్సర ఫ్లెక్సీల ఏర్పాటులో జరిగిన దాడిలో గెడ్డం అనిల్ గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధితుని పరామర్శించిన అనంతరం టిడిపి యువ నేత పెందుర్తి అభిరామ్ మాట్లాడారు. దాడి విషయంపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనిల్‌పై జరిగిన దాడి విషయాన్ని ఆసుపత్రి వర్గాల సమాచారం, కోర్టు ఆదేశాలతో సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గళ్ల గ్రామానికి చెందిన పెనుగుల రవి, కొంతమంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

ఇరు గ్రూపులపై కేసుల నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తి గ్రామంలో చెత్త కోసం ఘర్షణ పడి ఒకరిపై ఒకరి దాడి చేసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్‌సి ఏరియాలో ఎదురెదురుగా ఉంటున్న అరవ లోకుమారి, ఆమె తల్లి నాగమణి కుటుంబానికి, శ్రీమంతుల సింహాచలం, గోవిందు, కుమారి, వరలక్ష్మి కుటుంబానికి మధ్య చెత్త విషయంలో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రాళ్లు, కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరుపక్షాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

20 నుంచి 29 వరకూ పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - కోటనందూరు

ఈ నెల 20 నుంచి 29 వరకూ మండలంలో పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కోటనందూరు, కొట్టం గ్రామాల పశు వైద్య అధికారులు ప్రదీప్, రత్న తేజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు గర్భకోస పరీక్షలు నిర్వహించి టీకాలు మందులను ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

తలుపులమ్మ తల్లి దేవాలయానికి రూ.5.87 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - తుని

ఆదివారం నాడు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రసాదం విక్రయాలు పూజా టిక్కెట్లు, కాటేజీలు ద్వారా రూ.5,87,015 ఆదాయం వచ్చిందని తలుపులమ్మ తల్లి దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి విశ్వనాథరాజు తెలిపారు. ఈ లెక్కింపులో దేవస్థానం సిబ్బంది, అధికారులు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారన్నారు.

యానాం వార్తలు

నివాళులర్పిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

మాజీ స్పీకర్ కామిశెట్టికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి మాజీ స్పీకర్ కామిశెట్టి పరశురామ వరప్రసాదరావు నాయుడు వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిప్మర్ ఆసుపత్రి సమీపంలో ఇందిరా గాంధీ పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఎస్ఆర్‌కె డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వరుగు భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎస్‌పి రాజశేఖరన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మురుగానందం, నూకరాజు, హంసాని రామలక్ష్మణుడు, ప్రసాద్, కామిశెట్టి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మెమోంటోలు అందిస్తున్న లైన్స్ క్లబ్ సభ్యులు

యానాం క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - యానాం

స్థానిక కాకినాడ డిస్టిక్ స్పోర్ట్స్ క్రీడా ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడలో నిర్వహించిన డిస్టిక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో యానాం క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి నిర్వహించిన 400 మీటర్స్ నడక పోటీలో ప్రథమ స్థానంలో చింతం రామకృష్ణ నిలిచాడు. వాలీబాల్ పోటీలో విన్నర్‌గా నిలిచిన జట్టులో యానాంకు చెందిన ఇండుగుల వెంకటకృష్ణమోహన్, ముబారక్ ఖాన్, నందిగోళ్ల రామాంజనేయులు, పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు ఉన్నతంగా రాణించారు. అలాగే ఇండుగుల వెంకటకృష్ణమోహన్ బ్యాట్‌మెంటన్ డబుల్స్ విభాగంలోనూ, షాట్‌పుట్, జావలిన్ విభాగాల్లో ప్రథమ స్థానంలో విజయం సాధించాడు. 100 మీటర్స్ పరుగుపందంలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. ముబారక్ ఖాన్ 200 మీటర్ల పరుగుపందెంలోనూ, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. షాట్‌పుట్, జావలిన్ త్రోలో తృతీయ స్థానాలు, 100 మీటర్ల పరుగుల పందెంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. వీరిని యానాంకు చెందిన ప్రముఖులు అభినందించారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి

ప్రజాశక్తి - యానాం

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వాహనదారులకు హెల్మెట్ ఉపయోగంపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కలిసి కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈనెల 23 వరకు అవగాహన కార్యక్రమాల నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి తిర్రి గోపి తెలిపారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ టోర్నీ

ట్రోఫీతో బాస్కెట్‌బాల్ పురుషుల విజేత జట్టు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆల్ ఇండియా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఈ నెల 18న ముగిసింది. కార్యదర్శి గన్నమని చక్రవర్తి మాట్లాడుతూ ఈనెల 14 నుంచి నిర్వహించినపట్టణంలోని కృతివెంటి పేర్రాజు పంతులు క్రీడా మైదానంలో 14వ ఆల్ ఇండియా, 21వ ఆంధ్రప్రదేశ్ మెన్ అండ్ ఉమెన్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టులో దీనిని నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో వివిధ రాష్ట్రాలకు చెందిన మెన్స్ 24 టీమ్స్, ఉమెన్స్ 12 టీమ్స్ తలపడ్డాయి. ముగింపు సభలో కార్యదర్శ గన్నమని చక్రవర్తి మాట్లాడుతూ బాస్కెట్ బాల్ పరిరక్షణ ఆఫ్ ఇండియా అనుమతితో బాస్కెట్ బాల్ అసోసియేషన్ తూర్పుగోదావరి పర్యవేక్షణలో నిర్వహించమని అన్నారు. ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ నిధులతో సింథటిక్ కోర్టు నిర్మించామని, ఎంపీ గంటి హరీష్ మాదుర్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ లు గవర్నమెంట్ ప్రారంభించారన్నారు. ఈ టోర్నమెంట్ లో ఉమెన్స్ విభాగంలో ఎస్ఆర్ఎమ్ యూనివర్శిటీ చెన్నై విన్నర్‌గా నిలిచిందన్నారు. పటేల్ అకాడమీ భిలాయ్ 45 పాయింట్లు తో రన్నర్ గా నిలిచిందని వివరించారు. మెన్స్ విభాగంలో సిఆర్‌పిఎఫ్ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ చిత్తూరు జట్టు ఫైనల్‌గా తలపడగా సిఆర్‌పిఎఫ్ జట్టు 72 పాయింట్లు విన్నర్‌గా గెలిచింది. చిత్తూరు జట్టు 51 పాయింట్లుతో రన్నర్‌గా నిలిచాయి. విన్నర్‌కు రూ.25,000 నగదు బహుమతి, రన్నర్ రూ.20,000 నగదు బహుమతి ప్రైజ్ మనీ, విజేతలుకు కప్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్టాలిన్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి, గరికపాటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీతో అందుకుంటున్న బాస్కెట్‌బాల్ మహిళల విజేత జట్టు

లోకేష్ డిప్యూటీ సిఎం అయితే తప్పేముంది?

ప్రజాశక్తి - పిఠాపురం

మంత్రి లోకేష్‌కు డిప్యూటీ సిఎం పదవిని అడిగితే తప్పేముందని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎస్.వర్మ అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడారు. టిడిపి సభ్యత్వాలు కోటి చేయించిన ఘనత నారా లోకేష్‌దేనని అన్నారు. కోటి సభ్యత్వాలు నమోదుకు కృషి చేసిన నాయకుడు లోకేష్‌కు పిఠాపురం నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచంలో మొదటి సారిగా కార్యకర్తలకు ఇన్సురెన్స్ ప్రవేశపెట్టిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. టిడిపికి భవిష్యత్ లేదని అన్న వారందరికీ యువగళం పాదయాత్రతో టిడిపి, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం తీసుకువచ్చిన నాయకుడు లోకేష్ అని అన్నారు. ఏ పార్టీ కార్యకర్తల మనోభావాలు వారికి ఉంటాయని, తమ నాయకుడు పార్టీ కోసం పడిన కష్టాన్ని గుర్తించాలని క్యాడర్ అనడంలో తప్పేముందన్నారు. ఓడిపోయి భవిష్యత్తు ఏంటో తెలియని జగన్ నే సిఎం, సిఎం అంటున్నారని, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అని జనసేన కార్యకర్తలు పిలుచుకుంటున్నారని, అలాంటిది పార్టీని కష్ట సమయంలో కాపాడుకున్న లోకేష్‌ను డిప్యూటీ సిఎంని చేయాలని పార్టీ శ్రేణులు కోరడంలో తప్పేముందని అన్నారు. ఇది తన ఒక్కడి అభిప్రాయం కాదని, కార్యకర్తల మనసులో ఉన్న మాట అని అన్నారు. పార్టీ అధినేత సిఎం చంద్రబాబు నాయుడు తీసుకునే నిర్ణయమే తమకు శిరోధార్యం అని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకినాడ కెనాల్ రోడ్డుకు మరమ్మతులు

ట్రాఫిక్‌ను మళ్లింపు

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ - సామర్లకోట కెనాల్ రోడ్‌కు ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో కాకినాడ సామర్లకోట కెనాల్ రోడ్‌లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఆర్ అండ్ బి, పోలీసు అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ నుంచి సామర్లకోట ప్రయాణించే వాహనాలను భానుగుడి జంక్షన్, సర్పవరం, అచ్చంపేట, ఉండూరు మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించినట్లు తెలిపారు. సామర్లకోట నుంచి కాకినాడ వచ్చే వాహనదారులు ఉండూరు, అచ్చంపేట జంక్షన్, సర్పవరం జంక్షన్ మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించినట్లు తెలిపారు. ఈ ట్రాఫిక్ డ్రైవర్షన్ ఉదయం 3 గంటల మొదలుకుని సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని తెలిపారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

దేవస్థానానికి వాటర్ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి - తుని

తుని రూరల్‌లోని తలుపులమ్మ తల్లి దేవస్థానానికి తాండవ షుగర్ ఫ్యాక్టరీ మాజీ ఛైర్మన్ సుర్ల లోవరాజు వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. ఆదివారం వాటర్ ప్లాంట్‌ను దేవస్థానం కార్యనిర్వహణ అధికారి విశ్వనాథరాజుకు ఆయన అందించారు. లోవరాజు కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది : ముద్రగడ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తల్లిని మించిన దైవం లేదని, వారి రుణం తీర్చుకోలేనిదని మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం అన్నారు. కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ప్రముఖ కాంట్రాక్టర్ గణేశుల రాంబాబు కుటుంబ సభ్యులు తన తల్లి రాజామణికి ఆదివారం పాద పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముద్రగడ దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముద్రగడ మాట్లాడుతూ తల్లిదండ్రులను ఎలా గౌరవించాలో ఎలా పూజించాలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కాంట్రాక్టర్ గణేశుల రాంబాబు మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదేనన్నారు. పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసిన తల్లిదండ్రుల పాత్రను మరువరాదన్నారు. తన తల్లిదండ్రులు పేరున ప్రతి ఏటా తనకు తోచిన విధంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని తెలిపారు. తల్లిని ఇలా పూజించుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ లక్ష్మణరావు, పద్మనాభం, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి పాదపూజ చేస్తున్న రాంబాబు తదితరులు

పరిష్కారానికి నోచుకోని కబేళా సమస్య

రామచంద్రపురం- కాకినాడ మెయిన్‌రోడ్‌లో కబేళా నిర్వహిస్తున్న ప్రాంతం ఇదే

ప్రజాశక్తి - రామచంద్రపురం

సుమారు 40 సంవత్సరాలుగా పట్టణ ప్రజలను ప్రయాణికులను నిత్యం వేధిస్తున్న సమస్య రామచంద్రపురం కబేళా నేటికీ పరిష్కారం కాలేద. దీనిపై రామచంద్రపురం పట్టణవాసులు, చోడవరం గ్రామస్తులు అనేకసార్లు ఉద్యమాలు చేసి తాత్కాలికంగా నిలుపుదల చేసినా పశు మాంసం విక్రయంతో రూ.లక్షలు ఆర్జించే వ్యాపారులు దీనిని యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. పలువురు రాజకీయ నాయకుల అండదండలతో కబేల వ్యాపారం కొనసాగుతోంది. దీనిపై పలుమార్లు కేసులు నమోదు చేసినా ఫలితం లేదని ప్రయాణికులు, పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రపురం పట్టణం నుంచి కాకినాడ వెళ్లే మెయిన్ రోడ్డులో నిత్యం ఈ ప్రాంతంలో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఇక్కడ పశువులను వధించిన వ్యాపారులు వాటి వ్యర్థాలను వదిలేసి పోవడంతో భరించలేని దుర్వాసన నిత్యం వేధిస్తుంది. రామచంద్రాపురం కాకినాడ వెళ్లే బస్సులు ఎక్స్ ప్రెస్ బస్సులు, మోటార్ వాహనాలు, ప్రయాణికులుతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. దీనితో ప్రయాణికులు చోడవరం బైపాస్ రోడ్డు వచ్చిందంటే చాలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. గతంలో కొత్తూరు రోడ్డులో ఉండే ఈ కబేళాను నిర్వాహకులు నెమ్మదిగా పట్నంలోని బైపాస్ రోడ్డుకు తరలించారు. వారి వ్యాపారానికి అనుకూలంగా ఉండడంతో 40 ఏళ్లుగా ఇక్కడే కబేళా కొనసాగుతోంది. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉండాల్సిన ఈ పశువధశాలను బైపాస్ రోడ్ లో ఏర్పాటు చేయడం వల్ల అటు చోడవరం గ్రామస్తులకు ఇటు రామచంద్రపురం పట్టణవాసులకు తీవ్ర ఇబ్బందులు పడవలసిన పరిస్థితి. దీనిపై ఎన్నిసార్లు పోలీసులు కేసులు నమోదు చేసిన వ్యాపారులు తిరిగి కబేళాలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రికి కబేళా సమస్యను పరిష్కరించాలని దీనిపై అధికారులు స్పందించి బైపాస్ రోడ్ లో ఉన్న కబేళాను తొలగించాలని పట్టణ వాసులు, ప్రయాణికులు తదితరులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా వేమన జయంతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడలో వేమన రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేమన జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని వేమన సాహిత్యం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రజాకవి, గొప్ప మానవతావాది అయిన వేమన పద్యాలు సమాజానికి మార్గదర్శకాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తాడి శ్రీనివాస రెడ్డి, ఎంపిటిసి సభ్యుడు మారిశెట్టి శ్రీనివాస రావు, మాజీ ఎంపిటిసి సభ్యుడ తాడి నాగమోహన రెడ్డి, నల్లమిల్లి రామారెడ్డి, మాజీ సొసైటీ ఛైర్మన్ తాడి మెహెర్ ఆదిత్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** సమాజహితం కోరి రచనలు చేసిన పద్య కవి వేమన అని కళా సాహితి కొనియాడింది. నగర పంచాయతి పరిధిలోని స్థానిక కరెంటు ఆఫీస్ కార్యాలయం ఎదుట టెట్ భవనంలో కళాసాహితి సహాయ కార్యదర్శి పి.విజయకుమార్ అధ్యక్షతన ఆదివారం వేమన జయంతి నిర్వహించారు. కవిశ్రీ నాగేంద్ర మాట్లాడుతూ వేమన తన పద్యాల రూపంలో ప్రజల్లో చైతన్యం నింపారని కొనియాడారు. కార్యక్రమంలో మట్టా శ్రీనివాసరావు, నేరేడుమెల్లి అబ్బులు, విత్తనాల వరప్రసాద్, మెల్లం దుర్గాప్రసాద్, గెడ్డం శ్రీను, దేవరపల్లి సత్యనారాయణ, లంకే హరీష్ తదితరులు పాల్గొన్నారు.

In the Court of the VIth Additional District Judge at Kakinada
A.S. No. 138/2018

Between:
Machavarapu Naresh Kumar ...*Appellant*
AND
Tavitiki Suguna Kumar ...*Respondent*

To:
Family members of (Late)
Tavitiki Suguna Kumar, S/o. Prabhudas, Christian, Education and Business, R/o. D.No. 70-3-48/4, Vidyuth Nagar, Road No.1, Kakinada.

పై నెంబరు అప్పీలు దావాలో రెస్పాండెంటు కుటుంబ సభ్యుల చిరునామాకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను సదరు రెస్పాండెంటు కుటుంబ సభ్యులు తీసుకొన కుండగా Evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 30-1-2025వ సం॥ తేదీకి వాయిదా వేసినారు. సదరు రెస్పాండెంటు కుటుంబ సభ్యులు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై అప్పీలు దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
భమిడిపాటి వెంకట రామశర్మ
డి.వి.యస్.యస్.సుజన
న్యాయవాదులు, కాకినాడ
సెల్: 9246589838

మహారాజశ్రీ కాకినాడ 6వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A. 504/2020 మరియు
I.A. 505/2020 మరియు
I.A. 506/2020
O.S. 48/2019

Between:
పిటీషనరు (వాది):
పుట్టా రామకృష్ణ చౌదరి
AND
రెస్పాండెంట్లు (ప్రతివాద్లు):
పెదిరెడ్ల అప్పలనర్సమ్మ, వగైరా
To: ***Proposed Parties:***

R-10: పెదిరెడ్ల లక్ష్మి, W/o. మాణిక్యాల రావు, వయస్సు 52 సం॥లు, డోరు నెంబరు: 6-7-28, పర్తుల్ల వీధి, పెద్ద రైస్‌మిల్లు వద్ద, సామర్లకోట, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా.

R-11: పెదిరెడ్ల వెంకట హరీష్, S/o. మాణిక్యాలరావు, వయస్సు 40 సం॥లు, డోరు నెంబరు: 6-7-28, పర్తుల్ల వీధి, పెద్ద రైస్‌మిల్లు వద్ద, సామర్లకోట, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా.

R-12: లంక క్రాంతి, W/o. దినకర్, D/o. పెదిరెడ్ల మాణిక్యాలరావు, వయస్సు 38 సం॥లు, డోరు నెంబరు: 6-7-28, పర్తుల్ల వీధి, పెద్ద రైస్‌మిల్లు వద్ద, సామర్లకోట, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా.

R-13: చోడే జ్యోత్స్న, W/o. వెంకట రమణ, D/o. పెదిరెడ్ల మాణిక్యాలరావు, వయస్సు 36 సం॥లు, డోరు నెంబరు: 6-7-28, పర్తుల్ల వీధి, పెద్ద రైస్‌మిల్లు వద్ద, సామర్లకోట, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు పిటీషను I.A. 504/2020 (పెదిరెడ్ల మాణిక్యాలరావు గారు కాలం చేసినందున వారసులు పిటీషను దాఖలు చేయుటలో కలిగిన 21 రోజులు ఆలస్యమును క్షమించమని (Section 5 Petition), I.A. 505/2020 (పెదిరెడ్ల మాణిక్యాలరావు గారు కాలం చేసినందున వారసులు పిటీషను దాఖలు చేయుటలో కలిగిన ఆలస్యమును క్షమించమని to set aside the abatement), I.A. 506/2020 (పెదిరెడ్ల మాణిక్యాలరావు గారు కాలం చేసినందున వారికి మిమ్ములను వారసులుగా చేర్పించమని LR పిటీషను) లలో శ్రీ కోర్టు వారు పాస్ చేసిన ఆర్డరు ప్రకారం పైన తెలిపిన 10 నుండి 13 రెస్పాండెంట్లుకు కోర్టు ద్వారాను, పోస్టల్ ద్వారాను ఎన్నిసార్లు సమనులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందు వలన సదరు పైన తెలిపిన 10 టు 13 రెస్పాండెంట్లు పై కోర్టు వారి ఎదుట **ది. 31-01-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరయి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చు కోవలెను. లేని ఎడల మీ పరోక్షము నందు తీర్మానించబడునని యిందుమూలముగా తెలియచేయడమైనది.

మెర్ల సూర్యనారాయణ
మల్లంపల్లి సర్వేశ్వరరావు
కాకినాడ అడ్వకేట్స్, కాకినాడ
04-1-25 సెల్: 9848265645

మహారాజశ్రీ కాకినాడ 6వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S.No. 323 / 2018

Between:
1) నున్న వెంకటేశ్వరరావు
2) పూసర్ల మణి ...అప్పిలెంట్స్
మరియు
బట్రేటి స్వామి (died) & 25 others...రెస్పాండెంట్స్

To: రెస్పాండెంట్స్:
R2: బట్రేటి సత్తిబాబు, S/o. (లేటు) స్వామి, కరప గ్రామం, కరప మండలం, కాకినాడ జిల్లా.
R4: కేదారిశెట్టి సూర్యనారాయణ మూర్తి, S/o. లేటు తమ్మయ్య, పిఠాపురం, కాకినాడ జిల్లా.
R5: కేదారిశెట్టి కామేశ్వరరావు, S/o. (లేటు) తమ్మయ్య, పిఠాపురం, కాకినాడ జిల్లా.
R6: కేదారిశెట్టి చంద్ర గుప్త, S/o. (లేటు) తమ్మయ్య, పిఠాపురం, కాకినాడ జిల్లా.
R8: కాపుగంటి మంగతాయారు, W/o. కొండలరావు, మెయిన్‌రోడ్డు, స్టేట్‌బ్యాంక్ ప్రక్కన, కాకినాడ.
R9: కేదారిశెట్టి ఉమా మహేశ్వరి, W/o. (లేటు) తమ్మయ్య, మెయిన్‌రోడ్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం.
R10: ఉప్పలపాటి మాచరిరావు, S/o. వీర్రాజు. మెయిన్‌రోడ్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం.
R11: నున్న ప్రభావతి, W/o. వెంకట సుబ్బారావు, మెయిన్‌రోడ్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం.
R12: నార్శెడమిల్లి మాణిక్యాలరావు, S/o. భాస్కరరావు, మునసబుగారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2
R13: నార్శెడమిల్లి విష్ణుబాబు, S/o. భాస్కరరావు, మునసబు గారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2
R14: నార్శెడమిల్లి రాంబాబు, S/o. భాస్కరరావు, మునసబుగారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2
R15: నార్శెడమిల్లి వేణుగోపాలరావు, S/o. భాస్కరరావు, మునసబుగారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2
R16: నార్శెడమిల్లి పార్వతి, D/o. భాస్కరరావు, మునసబుగారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2
R17: నార్శెడమిల్లి లలిత, D/o. భాస్కరరావు, C/o. మాణిక్యాలరావు, మునసబుగారి తూము దగ్గర, జగన్నాయక్‌పూర్, కాకినాడ-2.
R20: నున్న సత్యవతి, W/o. వెంకట సుబ్బారావు, కరప గ్రామం, కరప మండలం, కాకినాడ జిల్లా.
R21: సలాది వెంకటేశ్వరరావు, S/o. బాపనయ్య, భక్తాంజనేయ వీధి, కరప గ్రామం, కరప మండలం, కాకినాడ జిల్లా.
R22: యలమర్తి రామారావు, S/o. లక్ష్మణమూర్తి, భారతి బుక్స్ & స్టేషనరీ ఎదురుగా, పూర్ణామార్కెట్, విశాఖపట్నం.
R23: యలమర్తి లక్ష్మణగుప్త, S/o. రామారావు, భారతి బుక్స్ & స్టేషనరీ ఎదురుగా, పూర్ణామార్కెట్, విశాఖపట్నం.
R25: యలమర్తి సతీష్, S/o. రామారావు, భారతి బుక్స్ & స్టేషనరీ ఎదురుగా, పూర్ణామార్కెట్, విశాఖపట్నం.

పై నెంబరు అప్పీలు యందు అపీలుదార్లు దాఖలుచేసిన అపీలు దావాలో మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు మీకు పంపినప్పటికి, రెస్పాండెంట్స్ అయిన మీరు తీసుకొనియుండ లేదు. కావున సదరు అపీలు దావా మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.**31-01-2025** తేదీనాటికి వాయిదా వేసి యున్నారు.కావున సదరు రోజున ఉదయం గం॥**10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు యున్న యెడల మీరు తెలుపుకొనవచ్చును. లేనియెడల పై అపీలు దావా విషయము కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
A.V.V. సత్యనారాయణ
అడ్వకేటు, డో.నెం.8-13/3-2/3, శ్రీనిలయం,
కాకినాడ **రాజప్రకాష్ వీధి, ప్రతాప్‌నగర్, కాకినాడ**
తేది.16-01-2025 **సెల్: 6301204436**